# ఆలయ అభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, డిసెంబర్ 15 : ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్ రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద నిర్వహించిన చండీహోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతనతో భక్తిమార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, నాయకులు వీరేశం, సతీశ్, కిశోర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పరామర్శ

నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గునుకుల బాల్‌రెడ్డి శుక్రవారం మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు విఠల్, కిష్టారెడ్డి, నాయకుడు రాంరెడ్డి ఉన్నారు.

-నారాయణఖేడ్, డిసెంబర్ 15



# సమస్యలు పరిష్కరిస్తాం..



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, డిసెంబర్ 15 : ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ 8వ బ్లాక్‌లో శుక్రవారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ బస్తీదర్శన్ నిర్వహించారు. కాలనీలో తిరుగుతూ కాలనీవాసులను స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, వీధి దీపాలు, సీసీ రోడ్డు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆమె త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఆమెవెంట అబ్దుల్‌గఫర్, సుధాకర్‌గౌడ్, నయీమ్, మోయిన్, నవీన్, మహేశ్, మోహన్‌గౌడ్, మల్లికార్జున్ ఉన్నారు.

# భవిత పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

జహీరాబాద్, డిసెంబర్ 15 : జహీరాబాద్ పట్టణంలోని భవిత పాఠశాలలో చదువుకుంటున్న దివ్యాంగుల సమక్షంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఎంఈవో కార్యాలయం అవరణలో ఉన్న భవిత పాఠశాలలో క్రికెట్ కోచ్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దివ్యాంగు విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్, కలర్ పెన్సిల్స్ అందజేశారు. న్యాయవాదులు శ్రీనివాస్ ఖన్నా, నతానియల్, ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు మురళీగౌడ్ పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుతో ప్రజలకు మేలు

కోహీర్, డిసెంబర్ 15 : పరిశ్రమల ఏర్పాటుతో ప్రజలకు మేలు కలుగుతుందని టీఎస్ఐసీసీ పటాన్‌చెరు జోనల్ మేనేజర్ సుధారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని దిగ్వాల్ గ్రామంలో పరిశ్రమల ఏర్పాటుకు సరిహద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు వేదికకు ముందున్న పది ఎకరాల్లో ఒక పరిశ్రమ, చిల్కేపల్లి గ్రామ ప్రధాన రహదారి పక్కన మరోశ్రమను ఏర్పాటు చేసేందుకు టీఎస్ఐసీసీ భూములను కేటాయించిందని వివరించారు. పరిశ్రమలు అందుబాటులోకి వస్తే గ్రామ ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. సమీప రైతులు కూడా సహకరించాలని సూచించారు. ఆమె వెంట డివిజన్ సర్వేయర్ భిక్షపతి, ఆర్ఐ సత్యనారాయణ, మండల సర్వేయర్ బాల్‌రాజ్, పాండు, రైతులు ఉన్నారు.

# నగదు, బంగారు గొలుసు చోరీ

అందోల్, డిసెంబర్ 15 : జోగిపేట బస్టాప్‌లో జేబుదొంగలు రెచ్చిపోతున్నారు. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం వరుసగా ఇద్దరి వద్ద నుంచి నగదు, బంగారం చోరీచేశారు. గురువారం సాయంత్రం చిలిప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌కు చెందిర రాంరెడ్డి అనే రైతు డబ్బులు పోగొట్టుకోగా, శుక్రవారం ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బంగారం పోగొట్టుకుంది. ఫైజాబాద్‌కు చెందిన రాంరెడ్డి జోగిపేలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో రూ. 46 వేలు గోల్డ్‌లోన్ తీసుకున్నాడు. గురువారం రాత్రి సమయంలో ఇంటికి వెళ్లేందుకు బస్సెక్కే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయన జేబును కత్తిరించి నగదును కాజేశారు. దీంతో ఆయన జోగిపేట ఠాణాకు చేరుకుని ఫిర్యాదు చేశారు. శుక్రవారం సైతం సంగారెడ్డికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మధులత బస్సులో చిట్కుల్ వెళ్తుండగా మెడలో పుస్తెలతాడును తెంపుకొనివెళ్లారు. దీంతో ఆమె భర్తతో కలిసి జోగిపేట పోలీసులను ఆశ్రయించింది. ఇద్దరి నుంచి ఫిర్యాదులు స్వీకరించామని అన్ని సీసీ టీవీల పుటేజీలు పరిశీలిస్తున్నామని జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

# వైభవంగా 'అయ్యప్ప' ఆలయ వార్షికోత్సవం



బొంతపల్లిలో సామూహిక మంగళ గౌరీవ్రతాలను ఆచరిస్తున్న భక్తులు

గుమ్మడిదల, డిసెంబర్ 15 : మండలంలోని బొంతపల్లి-వీరన్నగూడెంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం వైభవంగా ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. రకరకాల పూలతో అలంకరించారు. ముందుగా గణపతి హోమం, సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వందలాది మంది భక్తులతో మంగళగౌరీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో ఆచరించారు. అయ్యప్పస్వామి విగ్రహాన్ని అశ్వాల వాహనంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సద్దిప్రవీణా విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, మమతావేణు, గురుస్వాములు నాగభూషణం,ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మడపతి గణేశ్, ఆంజనేయులు గౌడ్, కుమార్‌గౌడ్‌లతో పాటు వందలాది మంది అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

## స్వచ్ఛ టాయిలెట్లను వినియోగించుకోవాలి

రామచంద్రాపురం, డిసెంబర్ 15 : స్వచ్ఛ టాయిలెట్లను వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలితాసోమిరెడ్డి అన్నారు. శుక్రవారం క్లీన్ టాయిలెట్ల కార్యక్రమంలో భాగంగా పబ్లిక్ టాయిలెట్ల వద్ద మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేసి వాటి ఆవరణంలో రంగుల ముగ్గులు వేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయకూడదని తెలిపారు. తెల్లాపూర్‌ను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కమిషనర్ సమ్మయ్య, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## వాలీబాల్ కిట్లు పంపిణీ

బొల్లారం, డిసెంబర్ 15 : క్రీడల్లో యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వాలీబాల్ కిట్లను అందిస్తున్నదని రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన యువకులకు వీవీఆర్ ఫౌండేషన్ తరపున వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. క్రీడా సామగ్రి అందించిన నాయకుడికి యువకులు ధన్యవాదాలు తెలి పారు. కార్యక్రమంలో జేజే సింగ్, సతీశ్, సురేశ్, సంతోశ్, జీవరత్నం, నవీన్, వినోద్, వంశీ, కాలనీ యువకులు పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న నేతలు

## పోలింగ్‌బూత్‌లపై సమీక్ష

గుమ్మడిదల, డిసెంబర్ 15 : స్థానిక ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి ఎన్నికల అధికారులు ఎన్నికల పోలింగ్‌బూత్‌లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం మండలంలోని తహసిల్‌లో మండల ఎన్నికల అధికారి గంగాభవానీ, నాయబ్ తహసీల్దార్ కరుణాకర్‌రావు, గిర్దావరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించి, సహకరించాలనిన కోరారు. అలాగే 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## పాఠశాలల సమగ్ర సమాచారం నమోదు చేయాలి

న్యాల్‌కల్, డిసెంబర్ 15 : యూ-డైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్)లో పాఠశాలల సమగ్ర సమాచారం నమోదు చేయాలని మండల విద్యాధికారి మారుతీరాథోడ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ఎంఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరికీ ఒక శిక్షణ తరగతుల్లో భాగంగా యూ-డైస్ ప్లస్‌లో పాఠశాలల సమగ్ర సమాచారం నమోదు చేసే విధానాన్ని వివరించారు. నమోదు చేసిన వివరాల అధారంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ తమ పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యూ-డైస్‌లో తప్పకుండా నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన యూ-డైస్ ఫారాలు ఎంఆర్‌సీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది రవికుమార్, సీఆర్‌పీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# కేతకీలో కాలుష్య నియంత్రణ కార్యదర్శి పూజలు



కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శిని సన్మానిస్తున్న కేతకీ ఆలయ అధికారులు

ఝరాసంగం, డిసెంబర్ 15 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి కృష్ణ ఆదిత్య శ్రీరామ్ శెట్టి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి రాజగోపురం ఎదుట వేద మంత్రాలు వల్లిస్తూ పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అధికారులు, అర్చకులు తీర్థప్రసాదాలను అందజేసి సన్మానించారు. ఆలయ అధికారులు రమేశ్, వీరన్న, అర్చకులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌పై అవగాహన సదస్సు



తొగర్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొండాపూర్, డిసెంబర్ 15 : మండల పరిధిలోని తొగర్‌పల్లిలో శుక్రవారం ఉద్యానవన ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన వన డివిజన్ అధికారి శైలజ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటలకు మూడేండ్ల వరకు ఎకరాకు రూ.4,200 ప్రోత్సహంగా అందనున్నదని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. సర్పంచ్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ, రైతులు పాల్గొన్నారు.

# రేపు ఆదర్శ పాఠశాలలో పిల్లల పండుగ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

జహీరాబాద్, డిసెంబర్ 15 : చిన్న పిల్లల్లో ఉన్న నైపుణ్యతను బయటకు తీసేందుకు పిల్లల పండగ నిర్వహిస్తున్నామని జహీరాబాద్ పిల్లల పండుగ కన్వీనర్ డాక్టర్ ఏ. విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని శ్రామిక్ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శామ్రిక్ విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో 17న ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో 76 పాఠశాలకు చెందిన విద్యార్థులతో ఈవెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లల పండుగలో ఉత్తమ ప్రతిభ కనబరించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ట్రస్టు మేనేజరు బి. రాంచందర్, కార్యదర్శి డాక్టర్ శివబాబు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అశోక్ సిరిసి, రామచంద్రయ్య, నర్సింహులు, శ్వేత, శ్రీనివాస్, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి..

అందోల్, డిసెంబర్ 15 : ఆర్టీసీ బస్సు-బైక్ ఢీ కొనగా ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయలైన సంఘటన మండల పరిధిలోని తాలెల్మ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించి జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన రాజ్‌కుమార్, సందీప్ ఇద్దరు తాలెల్మలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో భాగంగా బైక్‌పై శుక్రవారం జోగిపేట నుంచి తాలెల్మకు వెళ్తుండగా తాలెల్మ వద్ద వట్‌పల్లి నుంచి జోగిపేట వైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన రాజ్‌కుమార్ (40) ఘటన స్థలంలోనే మృతి చెందగా, సందీప్‌ను జోగిపేట ప్రభుత్వ దవఖానాకు తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు.